నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 5 డిసెంబర్ 2024 | SIDDIPET

హరీశ్‌రావు కేసులకు భయపడే నాయకుడు కాదు

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ):హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... కేసులకు భయపడే నాయకుడు హరీశ్‌రావు కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పంట రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా మాట తప్పారన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతున్న హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తే సహించేదిలేదన్నారు. జైలులో పెట్టాలని చూస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఉద్యమాల ద్వారా ప్రజలే హరీశ్‌రావును కాపాడుకుంటారన్నారు. చిల్లర నాయకులతో హరీశ్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయించడం సీఎం దివాలా కోరు రాజకీయాలకు నిదర్శనమని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యలేక ప్రభుత్వం అక్రమ కేసు నమోదు చేయించిందని బీఆర్ఎస్ నేత మామిండ్ల ఆంజనేయులు ఆరోపించారు.

రుణాల మంజూరుపై దృష్టి సారించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 4: ఇందిరా మహిళా శక్తి సంఘాలకు అందించే రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులు, బ్యాంకర్లకు సూచించారు. ఇందిరా మహిళా శక్తి సంఘా లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు బ్యాంకు లింకేజీ రుణాలు పెండింగ్ పెట్టకుండా మంజూరు చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, మెప్మా, డీఆర్డీవో, ఇందిరా క్రాంతి వంటి ప్రాధాన్యం గల పథకాల కింద రుణాలను వెంటనే అందించాలన్నారు. సమావేశంలో ఆర్‌బీఐ మేనేజర్ తాన్య, నాబార్డ్ డీడీఎం కృష్ణతేజ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

వివాదాలకు నిలయం..మల్లన్న ఆలయం

- ముందుకు సాగని అమ్మవార్ల స్వర్ణ కిరీటాల తయారీ
- ప్రసాదాల తయారీపై కొరవడిన పర్యవేక్షణ
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు
- కొనసాగుతున్న ఒగ్గు పూజారుల వసూళ్ల పర్వం
- రోడ్డున పడిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది

ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రెండు జీవోలు జారీ చేసిన ప్రభుత్వం

నత్తనడకన సాగుతున్న క్యూలైన్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు(ఇన్‌సెట్‌లో) మల్లన్న వీఐపీ సూట్‌లో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

చేర్యాల, డిసెంబర్ 4:సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. కొన్ని నెలలుగా స్వామి ఆలయం నిత్యం ఏదో ఒక ఘటన, సమస్యలతో వార్తల్లోకి ఎక్కుతుండడంతో సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం సైతం ఆలయ అభివృద్ధి, ఉద్యోగుల బదిలీలు, కేటాయింపులు తదితర వాటి పట్ల పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులే దానిని వివాదాలకు నిలయంగా మారుస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ధర్మకర్తల మండలి నియామకంపై తర్జనభర్జన

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ధర్మకర్తల మండలి నియామకంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నది.14 మందితో నియమించాల్సిన ధర్మకర్తల మండలి విషయంలో ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎనిమిది మంది సభ్యులను ధర్మకర్తలుగా నియమించి, మిగిలిన ఆరుగురు సభ్యుల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ నూతనంగా నోటిఫికేషన్ విడుదల చేయడంతో అన్నివర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. ఏప్రిల్‌లోనే ధర్మకర్తల మండలి నియామకం కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో 72 మంది సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. ధర్మకర్తల మండలిని నియమించాలంటే ఇందులో నుంచి సభ్యులను నియమించవచ్చు లేదా కొత్తగా ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయవచ్చు కానీ వాటికి భిన్నంగా ఎనిమిది మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం మిగిలిన సభ్యుల నియామకం కోసం కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ముందుకు సాగని 'అమ్మవార్ల' స్వర్ణ కిరీటాల తయారీ

మల్లన్న బ్రహ్మోత్సవాల వరకు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు స్వర్ణ కిరీటాలు చేయించి సమర్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గత బ్రహ్మోత్సవాలతో పాటు ఇటీవల కొమురవెల్లిలో ఆమె పర్యటించిన సందర్భంగా ప్రకటించారు.కానీ ఇప్పటి వరకు స్వర్ణ కిరీటాల విషయంలో ఎలాంటి పురోగతి లేక భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకున్న మిశ్రమ బంగారాన్ని స్వచ్ఛమైన బంగారంగా మార్చి దానిని కిరీటాలుగా తయారు చేయించే సమయం మంత్రులు, దేవాదాయశాఖ అధికారులకు లేక పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసాదాల తయారీ పై కొరవడిన పర్యవేక్షణ

ఆలయంలో లడ్డూ, పులిహోర ప్రసాదాలను భక్తులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. మల్లన్న ప్రసాదాల తయారీపై సంబంధిత విభాగం అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో ప్రసాదాలు తయారు చేసే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఓ భక్తుడు కొనుగోలు చేసిన పులిహోరలో వెంట్రుకలు, కీటకాల అవశేషాలు సైతం రావడం చర్చనీయాంశంగా మారింది.

నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు

భక్తుల వసతుల కోసం ప్రారంభించిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రూ.12కోట్లతో నిర్మిస్తున్న క్యూలైన్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. స్వామి వారి ఉత్సవాలు సమీపిస్తుండడంతో ఈసారి బ్రహ్మోత్సవాలకు క్యూలైన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. దీనికి తోడు గుట్టపై ప్రారంభించిన త్రిశూలం, డమరుకం పనులు వేగవంతం చేసి ఉత్సవాల వరకు దానిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. ఎల్లమ్మ ఆలయం వద్ద బోనాలు సమర్పించే ప్రదేశంలో ఎలాంటి రక్షణ లేక కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

కొనసాగుతున్న వసూళ్ల పర్వం

బ్రహ్మోత్సవాల సమయంలోనే కాకుండా ఆది, బుధ వారాలు, శ్రావణ, కార్తిక మాసాలు, ప్రత్యేక రోజుల్లో భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇదే సమయంలో మొక్కులు చెల్లించుకునే క్రమంలో పట్నం వేస్తున్న భక్తుల నుంచి పలువురు ఒగ్గు పూజారులు డిమాండ్ చేసి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఇదేతంతు కొనసాగిస్తుండడంతో మిగిలిన రోజుల్లో సైతం వారి వసూళ్లకు అడ్డూ అదుపు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

కొమురవెల్లి భక్తులకు వసతులు కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో దేవాదాయ శాఖ మంత్రిగా విధులు నిర్వహించిన పొన్నాల లక్ష్మయ్య ప్రత్యేక శ్రద్ధ వహించి రెండు వీఐపీ సూట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేశారు. ఆధునిక వసతులతో కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో రెండు వీఐపీ సూట్లు నిర్మాణానికి నోచుకున్నప్పటికీ వాటిని కాస్తా అధికారులు ఒకటి పోలీస్‌స్టేషన్, మరొకటి ఎంపీడీవో కార్యాలయానికి కేటాయించారు. రోజురోజుకూ పెరుగుతున్న వీఐపీల తాకిడిని గుర్తించి ఆలయ వర్గాలు వీఐపీ సూట్లు ఖాళీ చేసి తమకు అప్పగించాలని కోరడంతో పోలీసులు వీఐపీ సూటు ఖాళీ చేసి వెళ్లిపోయారు. కానీ ఎంపీడీవో కార్యాలయం కొమురవెల్లి మండలం ఏర్పాటు చేసినప్పటి నుంచి అణా పైసా చెల్లించకుండా మల్లన్న వీఐపీ సూట్‌లో కొనసాగుతున్నది. భవనం ఖాళీ చేయాలని ఆలయ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

రోడ్డున పడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఆలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురిని రాష్ట్రంలో అధికార మార్పిడి కాగానే కాంగ్రెస్ పెద్దలు తొలిగించి తమ పార్టీ వారిని నియమించాలని హుకుం జారీ చేశారు. దీంతో ఆలయ అధికారులు వారి పట్ల ఎలాంటి కనికరం లేకుండా తొలిగించడంతో ఐదు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తాము ఎన్నికల సమయంలో, గతంలో ఎప్పుడూ పార్టీల్లో తిరగలేదని సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసినా వారికి ఎలాంటి న్యాయం జరగలేదు.

సత్రంలో భోజనం అధికారులు, సిబ్బందికే..

కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో కొనసాగుతున్న అన్నప్రసాద వితరణశాలలో భోజనం భక్తులకు కాకుండా మల్లన్న ఆలయంలో పని చేసే కొందరు ఉద్యోగులు, మల్లన్న క్షేత్రంలో వివిధ కాంట్రాక్టు పనులు చేస్తున్న కార్మికులు, సూపర్‌వైజర్లు చేస్తున్నారు. వీరే కాకుండా మండలకేంద్రంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, కొందరు పోలీస్ సిబ్బంది సైతం అప్పుడప్పుడు అన్నదాన సత్రానికి వచ్చి భోజనం చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

ఆలయంలో పట్నంపై డబ్బులు, తూకం తక్కువగా ఉన్న పులిహోర

యాసంగి సాగుకు నీరందించాలి

- రాజరాజేశ్వర రిజర్వాయర్ ద్వారా సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయాలి
- నీటి విడుదలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలి
- సిద్దిపేట జిల్లా రైతుల పక్షాన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ

నీటిపారుదల శాఖ మంత్రికి లేఖ రాస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

T. HARISH RAO
M.L.A.
15-Siddipet Assembly Constituency
Camp Office :
H.No. 16-1924, Prashanthinagar, Siddipet Town and District.
Cell : 08457-22222
Hyderabad Office :
Villa No. 1025, Nirvana Villas, Papaiahguda, Financial District, Hyderabad.
Contact No. 040-23114222
Cell : 94404 71430

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి రాసిన లేఖ

సిద్దిపేట, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు బుధవారం లేఖ రాశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా సాగు, తాగునీటికి నోచుకోలేదని, తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్మాణాలు చేపట్టారని లేఖలో పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ల ద్వారా వరుసగా నాలుగేండ్లు జిల్లాలోని రైతాంగానికి గోదావరి జలాలు అందించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన నాలుగు ప్రాజెక్టుల ద్వారా నాలుగు జిల్లాలు సిద్దిపేట, మెదక్, యాదాద్రిభువనగిరి, జనగామలకు సాగు, తాగునీరు అందించామన్నారు. గత సంవత్సరం యాసంగి పంటకు కాళేశ్వరం జలాలతో నాలుగు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా మూడు లక్షల ఎకరాల పంట పండిందని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లాలోని ప్రాజెక్టులైన మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం 19.03 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 9.5టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 2.57 టీఎంసీలు, అన్నపూర్ణలో 3.21 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని, ఈ సంవత్సరం యథావిధిగా రైతులకు సాగునీరు అందించడానికి నీటి ప్రణాళిక కమిటీని ఆదేశించాలని మంత్రిని కోరారు. ప్రస్తుతం మిడ్ మానేరు(రాజరాజేశ్వర జలాశయం)లో 27 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని, మిడ్ మానేరు నుంచి అవసరమైన నీటిని ఈ రిజర్వాయర్లకు పంపింగ్ చేసి పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని కోరారు. ఇప్పటికే యాసంగి సాగుకు రైతులు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తరపున రైతులకు సాగు నీటి విడుదల కోసం భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం కూడా చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతులకు మేలు చేయాలన్నారు. నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వం తరపున ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగానికి భరోసా ఇవ్వాలని రైతుల పక్షాన హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం

బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మాజీమంత్రి హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టడాన్ని బీఆర్ఎస్ సిద్దిపట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయలేక, ప్రశ్నించే గొంతులను నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను రాజకీయంగా ఎదుర్కోలేకనే రేవంత్‌రెడ్డి చిల్లరగాళ్లను ఉసిగొల్పుతూ అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఆరుసార్లు గెలిచిన సీనియర్ ఎమ్మెల్యే, పదేండ్లు మంత్రిగా పని చేసిన వ్యక్తి హరీశ్‌రావు ప్రజాసేవలో లక్షలమంది అభిమానులు సంపాదించుకున్న పబ్లిక్ లీడర్‌పై చిల్లర రౌడీలు ఇచ్చే ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా.? అని ఘాటుగా ప్రశ్నించారు. హరీశ్‌రావుపై ఇప్పటికే అనేక కేసులు పెట్టారు..ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు అక్రమ కేసులు బనాయించడం శోచనీయమన్నారు. ఇది ప్రజా పాలన కాదు.. నిర్బంధాలు అణిచివేతల హిట్లర్ పాలన అని మండిపడ్డారు. రైతుబంధు, పంట రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు గురించి అడిగితే హరీశ్‌రావుపై కక్షతో కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో హరీశ్‌రావుకు సంబంధం లేదు. అతడిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా హరీశ్‌రావు నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు.తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామన్నారు. తస్మాత్ జాగ్రత్త రేవంత్ తక్షణమే హరీశ్‌రావుపై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అక్రమ కేసును ఖండిస్తున్నాం

దంతాన్‌పల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- పరిపాలన గాలికొదిలి ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న కాంగ్రెస్
- మెదక్ జిల్లా దంతాన్‌పల్లి ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, డిసెంబర్ 4 : కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, అక్రమాలను బయటపెడుతున్నందుకే మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావుపై కేసులు నమోదు చేస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చక్రధర్‌గౌడ్ చదివితే పోలీసులు హరీశ్‌రావుపై అక్రమంగా కేసులు పెట్టడం ఏమిటని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చకుండా ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తున్న హరీశ్‌రావుపై కక్షగట్టి కేసులు బనాయిస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి మాటలకు, మంత్రుల మాటలకు పొంతన లేదన్నారు. హరీశ్‌రావుపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రమణ, కల్లూరి హరికృష్ణ, కన్నారం దుర్గేశ్, నాగేశ్వరరావు, జగజీవన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, దేవలింగం, రమేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అధ్యయనం కోసమే కమిషన్

మాట్లాడుతున్న చైర్మన్ సమీమ్ అక్తర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 4: ఎస్సీ వర్గీకరణ అధ్యయనం కోసమే ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేసిందని ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ సమీమ్ అక్తర్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై విచారణ చేసేందుకు ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ బుధవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ కులసంఘాల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కుల సంఘాల నుంచి 212 వినతులు వచ్చాయన్నారు. వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం చేయడం కోసం వినతులు కీలకమన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి కుల సంఘాల అభ్యర్థనలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. అనంతరం కంది మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీని సందర్శించిన చైర్మన్ అక్కడ ప్రజల స్థితిగతులను పరిశీలించారు. ఏక సభ్య కమిషన్ చైర్మన్‌కు వినతులు వెల్లువెత్తాయి. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, అందోల్ మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తదితరులు కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు శ్రీధర్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి అఖిలేశ్‌రెడ్డి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫ్యాక్షన్ పాలన

- కాంగ్రెస్‌ను నిలదీస్తే అక్రమ కేసులా..?
- హరీశ్‌రావును ఎదుర్కోలేక రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు
- వెంటనే అక్రమ కేసులు ఎత్తివేయాలి
- బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ):రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగడంలేదని రేవంత్‌రెడ్డి ఫ్యాక్షన్ పాలన కొనసాగుతున్నదని, ఇందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయించడమే నిదర్శనమని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దీనిని ప్రశ్నిస్తున్న హరీశ్‌రావు గొంతునొక్కే ప్రయత్నం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని ధ్వజమెత్తారు. హరీశ్‌రావు వల్లనే పంట రుణమాఫీ చేయాల్సి వచ్చిందన్న కోపంతో ముఖ్యమంత్రి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.ఇది వరకే హరీశ్‌రావుపై మూడు తప్పుడు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చక్రధర్‌గౌడ్‌పైనే ఎన్నో కేసులు ఉన్నాయని, అలాంటి వ్యక్తి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హరీశ్‌రావు నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు సీఎం చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసులతో హరీశ్‌రావు కమిట్‌మెంట్‌ను తగ్గించలేరన్నారు. ఎన్నికేసులు నమోదు చేసినా తెలంగాణ ప్రజల పక్షాన, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆయన పోరాటం చేస్తూనే ఉంటారని తెలిపారు. అక్రమంగా బనాయించిన కేసును వెంటనే ఎత్తివేయాలని, లేదంటే రేవంత్‌కు ప్రజాకోర్టులో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీతిమాలిన చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకు అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. హరీశ్‌రావుకు పోలీసులు కొత్త కాదని, ఎన్ని కేసులు పెట్టినా ప్రజలపక్షాన పోరాటం చేస్తూనే ఉంటారని, రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సొంత గ్రామంలో సర్పంచ్ ఆత్మహత్య చేసుకుంటే అందుకు సంబంధించి రేవంత్‌రెడ్డి సోదరులపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. హరీశ్‌రావుపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్‌తో ఏం సంబంధం

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయించారని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. చక్రధర్‌గౌడ్ కోర్టులో తన పిటిషన్ విత్‌డ్రా చేసుకుని తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేయడం వెనకకుట్రదాగి ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు కేసులు పెట్టారని ఆరోపించారు. పదేండ్లపాటు హరీశ్‌రావు రాష్ట్రం, ఉమ్మడి మెదక్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశారని గుర్తుచేశారు.ఇప్పుడు ప్రజల పక్షాన, రేవంత్ సర్కార్‌పై పోరాటం చేస్తుంటే జీర్ణించుకోలేక అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని, దీనిని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ హరీశ్‌రావు ప్రజల పక్షా